
సాక్షి
ఒడిశా
మంగళవారం । 29 । అక్టోబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,73,977లు, బంగారం 1 గ్రాము 750 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఆక్రమణల తొలగింపు

రైల్వే స్థలాల్లో ఆక్రమణలు తొలగిస్తున్నారు. రాయగడలో తొలగింపులు జరుగుతున్నాయి.

- 10లో

నిన్న వలస కార్మికుడు..



ఓ వలస కార్మికుడు నేడు ఉన్నతాధికారిగా మారాడు. పట్టుదలతో చదివి అనుకున్నది సాధించాడు.

- 10లో

న్యూస్‌రీల్

నవరంగ్‌పూర్ సీడీఎంఓగా సంతోష్ పండా



కొరాపుట్: నవరంగ్‌పూర్ జిల్లా ముఖ్య వైద్యాధికారి (సీడీఎంవో)గా సంతోష్ కుమార్ పండాను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య శాఖ సోమవారం ఉత్తర్వులను వెలువరించింది. సంతోష్‌కుమార్ గతంలో ఉమ్మర్‌కోట్ సబ్ డివిజనల్ కేంద్రాస్పత్రిలో పేడియాట్రిషన్‌గా పని చేశారు.

అంబులెన్స్ కార్మికుల ఆందోళన



ర్యాలీలో పాల్గొన్న 108 అంబులెన్స్ సిబ్బంది

రాయగడ: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆల్ ఒడిశా 108 అంబులెన్స్ కర్మచారి మహాసంఘం ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం రాయగడ శాఖ కార్మికులు ఆందోళన నిర్వహించారు. స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా చేరుకున్న డ్రైవర్లు, సిబ్బంది ఈ మేరకు ఓ వినతి పత్రాన్ని కలెక్టర్ కార్యాలయానికి అందజేశారు. జీతాలు పెంచాలని, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో చనిపోతే రూ.20 పరిహారం అందించాలన్నారు. 108 అంబులెన్స్ కార్మికుల మహాసంఘం రాయగడ శాఖ అధ్యక్షులు గంగాధర్ సాబొరా, కార్యదర్శి జ్యానేంద్ర నాయక్ ల నేతృత్వంలో ఈ ఆందోళన కొనసాగింది.

కలెక్టర్‌కు వినతి



వినతి పత్రంతో కలెక్టర్ కార్యాలయం వద్ద అంబులెన్స్ సిబ్బంది

మల్కన్‌గిరి: జిల్లాలోని ప్రభుత్వ అంబులెన్స్ సిబ్బంది సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ ఆశిష్ పటేల్‌కు అందజేశారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



డొంబురు బొత్ర మృతదేహాన్ని తరలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కొరాపుట్: చెరువులో ప్రమాదవశాత్తు పడి నీటమునిగి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నవరంగ్‌పూర్ జిల్లా డాబుగాం సమితి జునాపానీ గ్రామ పంచాయతీ గిర్ల గ్రామంలో సోమవారం చోటుచేసుకోగా.. డొంబురు బొత్ర (60) ప్రాణాలు కోల్పోయాడు. స్నానం కోసం బొత్ర చెరువులోకి దిగి నీటిలో మునిగిపోయాడు. స్నానం కోసం వెళ్లిన వ్యక్తి చాలా సమయమైనప్పటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. అనుమానం వచ్చి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది చేరుకొని చెరువులో గాలించగా డొంబురు బొత్ర మృతదేహం లభ్యమైంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు డాబుగాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్వరలో దేవాలయ యోజన

భువనేశ్వర్: రాష్ట్రంలో దేవాలయాలు, మఠాలు సంరక్షణపై ప్రభుత్వం దృష్టి సారించింది. అనుబంధ వర్గాలతో సంప్రదించనుంది. ఈ సంప్రదింపుల్లో ఆలయాలు, మఠాలు ఇతరేతర అనుబంధ సంస్థల పరిరక్షణ కోసం ప్రభుత్వం దేవాలయ యోజన ప్రవేశ పెట్టేందుకు యోచిస్తుందని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ సోమవారం తెలిపారు.

అవినీతి నిర్మూలనే ధ్యేయం



రాష్ట్ర స్థాయి విజిలెన్సు చైతన్య వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి

- ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి
- అధికారులతో అవినీతి నిర్మూలన ప్రతిజ్ఞ

భువనేశ్వర్: అవినీతి నిర్మూలనే ధ్యేయంగా తమ పాలన కొనసాగుతుందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రకటించారు. విజిలెన్సు చైతన్య వారం ఆరంభాన్ని పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అధికారులతో అవినీతి నిర్మూలనకు కట్టుబడి విధులు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి ప్రతిజ్ఞ చేయించారు. ఉమ్మడి కృషి, సహకారంతో అవినీతి రహిత రాష్ట్ర నిర్మాణం సాధ్యమవుతుందని అభ్యర్థించారు. అవినీతి వ్యవహారాల దర్యాప్తు వ్యవస్థను మరింత పటిష్టపరిచేందుకు త్వరలో విజిలెన్సు ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరి స్థాపించనున్నట్లు పేర్కొన్నారు. అవినీతి కేసుల దర్యాప్తు, విచాణ, పర్యవేక్షణ, విచారణ ప్రక్రియ వేగవంతం చేయడంలో ఫోరెన్సిక్ ప్రయోగ శాల దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విజిలెన్స్ వ్యవస్థ పటిష్ఠపరిచే దిశలో మానవ వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తున్నారు. విజిలెన్స్ విభాగంలో కొత్తగా 8 అదనపు పోలీసు సూపరింటెండెంట్లు, 24 డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్లు, 16 సబ్ ఇన్‌స్పెక్టర్ల ఉద్యోగాలు పెంచనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా అవినీతి నిరోధక కార్యకలాపాల్లో విశిష్ట సేవలు అందించి ప్రతిభ ప్రదర్శించిన అధికారులు, సిబ్బందిని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సన్మానించారు. దేశ, రాష్ట్ర అభివృద్ధికి అవినీతి అతి పెద్ద అడ్డంకి. ఈ అడ్డంకులు తొలగించి పురోగతి బాటలో నడిపించేందుకు నిజాయితీపరులైన అధికారులు, సిబ్బంది అంకిత భావం ఎంతైనా అవసరమని ముఖ్యమంత్రి తెలిపారు.

ఉత్తమ పురస్కార గ్రహీతలు

ఉత్తమ అవినీతి నిర్మూలన అధికారిగా కొరాపుట్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ పీకే ద్వివేది, ఉత్తమ అవినీతి నిర్మూలన శాఖగా బొలంగీరు యూనిట్, ఉత్తమ విచారణ అధికారులుగా బాలాసోర్ యూనిట్ విజిలెన్స్ అధికారి దుష్మంత్ నాయక్, బరంపురం విజిలెన్స్ మండలం డీఎస్పీ సబితాంజలి నాయక్, విజిలెన్సు కోర్టు ఉత్తమ పబ్లిక్ ప్రాసిక్యూటరుగా హేమంత కుమార్ స్వంయిని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వ్యాప్తంగా అధికారులతో అవినీతి నిర్మూలన ప్రతిజ్ఞ చేయిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



అవినీతికి దూరంగా ఉంటామని ప్రమాణం చేస్తున్న అధికారులు, సిబ్బంది

అవినీతికి దూరంగా ఉందామంటూ..

రాయగడ: అవినీతి నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది అవినీతికి దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి, ఏడీఎం భాస్కర రైతా తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిరోధక అవగాహన వారోత్సవాలు ప్రారంభం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి కళాశాలలో విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాలు సోమవారం మొదలయ్యాయి. కాలేజీ యాజమాన్యం 1200మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించింది.



అవినీతి నిరోధక ర్యాలీలో పాల్గొన్న మల్కన్‌గిరి కాలేజ్ యాజమాన్యంతో విద్యార్థులు

బాణసంచా విక్రయాలపై పరిమిత ఆంక్షలు



దీపావళి బాణసంచా దుకాణం

భువనేశ్వర్: రాష్ట్రంలో దీపావళి సందడి ఆరంభమైంది. ఈ సందర్భంగా బాణసంచా దుకాణాల ఏర్పాటు, విక్రయానికి సంబంధించి నగర పోలీసు కమిషనరేటు ప్రత్యేక ఆంక్షలు విధించింది. ఒక్కో దుకాణంలో గరిష్ఠంగా 300 కిలోగ్రాముల బాణసంచా నిల్వకు మాత్రమే అనుమతించినట్లు నగర డీసీపీ పినాక్ మిశ్రా తెలిపారు. బాణసంచా తాత్కాలిక దుకాణాల ఏర్పాటు కోసం 465 పైబడి దరఖాస్తులు దాఖలయ్యాయి. వీటిలో సుమారు 200 మంది అభ్యర్థనలను ఆమోదించి తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు అనుమతించారు. ఈ లెక్కన నగరంలో 25 వేర్వేరు చోట్ల దుకాణాలు ఏర్పాటవుతాయి. ఒక్కో దుకాణం మధ్య 50 అడుగుల కనీస దూరం అనివార్యంగా పేర్కొన్నారు. అపరిమిత బాణసంచా నిల్వలపై కఠిన చర్యలు చేపడతారు. ఈ నేపథ్యంలో పోలీసుల ఆకస్మిక దాడులు ముమ్మరం చేసినట్లు వివరించారు. ఇప్పటి వరకు చేపట్టిన దాడుల్లో సుమారు రూ. 20 లక్షల విలువైన అక్రమ బాణసంచాను పోలీసులు జప్తు చేశారు. బలిపట్న ఠాణా ప్రాంతంలో పలు చోట్ల చేపట్టిన దాడుల్లో అత్యధికంగా 150 కిలో గ్రాముల పైబడిన బాణాసంచా తయారీ మందుగుండు సామగ్రి జప్తు చేశారు.

నవంబరు 1న దీపావళి

ఈ ఏడాది దీపావళి అమావాస్య మరియు కాళీ పూజ పట్ల ద్వంద్వం నెలకొంది. సాధారణంగా దీపావళి అమావాస్య, కాళీ పూజ ఒకే రోజున జరుగుతాయి. ఈ ఏడాది విభిన్నంగా రెండు వేర్వేరు రోజుల్లో ఈ కార్యక్రమాలు జరుపుకోవాలని రాష్ట్ర పంచాంగ పండితుల వర్గం చెబుతోంది. అక్టోబరు నెల 31వ తేదీ మధ్యాహ్నం 3.45 గంటలకు అమావాస్య ప్రవేశించి మరునాడు నవంబరు 1వ తేదీ సూర్యాస్తమయం తర్వాత కూడ కొనసాగుతుంది. ఈ లెక్కన అమావాస్య ఆరంభం రోజు రాత్రి అక్టోబరు 31న కాళీ పూజ జరుపుకుని మర్నాడు సూర్యోదయం తర్వాత దీపావళి అమావాస్య పూజాదులు జరుపుకోవాల్సి ఉందని వివరించారు. పలువురు దీపావళి నాడు పితృ తర్పణం, పితృ దేవతలకు విముక్తి వీడ్కోలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాష్ట్రంలో ఈ ఆచారం విస్తృతంగా మనుగడలో ఉంది.

క్యాలెండర్లలో అక్టోబరు నెల 31వ తేదీన దీపావళి అమావాస్యగా పేర్కొన్నారు. దేశంలో పలు ప్రాంతాల్లో సూర్యోదయం వేళల్లో వ్యత్యాసం ఉంటుంది. సగటు గణాంకాల ప్రకారం అత్యధిక క్యాలెండర్లు దీపావళి ఈ నెల 31న జరుపుకోవాలని సూచించాయి. కానీ రాష్ట్రంలో సూర్యోదయం లెక్కల ప్రకారం మర్నాడు నవంబరు నెల 1న దీపావళి అమావాస్య సంబంధిత పూజాదులు జరుపుకోవడం శ్రేయోదాయకమని పంచాంగ పండితులు తెలిపారు. నవంబరు నెల 1న అమావాస్య తిథి ఉభయ సూర్యోదయం, సూర్యాస్తమయం వేళల్లో కొనసాగుతున్నందున ఈ మేరకు సలహా ఇవ్వడం జరిగిందని స్పష్టం చేశారు. కొన్ని ప్రాంతాల్లో సూర్యాస్తమయం తర్వాత అమావాస్య తిథి లేనందున అక్టోబరు నెల 31న జరుపుకోవాల్సి వస్తుందన్నారు.

బిసంకటక్‌లో ఎంపీ సప్తగిరి పర్యటన

రాయగడ: కొరాపుట్ లోక్‌సభ సభ్యుడు సప్తగిరి శంకర్ ఉలక సామవారం బిసంకటక్ ప్రాంతంలో పర్యటించారు. కార్యకర్తలతో సమావేశమైన అయన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం సమితి పరిధిలోని కంకుబడి ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందివ్వాలని నిర్వాహకులను సూచించారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఆయన వెంట బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక ఉన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీ ఉలక, ఎమ్మెల్యే హికక

ఈపీఎఫ్‌పై అవగాహన



మహిళా డిగ్రీ కళాశాల ఉద్యోగులతో ప్రమాణం చేయిస్తున్న ఈపీఎఫ్ అధికారులు

పర్లాకిమిడి: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉద్యోగుల భవిష్యత్ నిధి ఆప్‌కె నికట్ 2.0 కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ రీనా సాహు ప్రారంభించారు. ఈ సమావేశంలో బరంపురం ఈపీఎఫ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి కె.మల్లేశ్వర రావు, సీనియర్ అసిస్టెంట్ గణేశ్వర స్వయిని పాల్గొన్నారు. ఉద్యోగుల భవిష్యత్ నిధిని కనీసం ఐదేళ్ల సర్వీసు తర్వాత సొంత మెడికల్ ఖర్చులు, ఇంటి నిర్మాణం కోసం విత్ డ్రా చేసుకోవచ్చని ఈఓ మల్లేశ్వర్ రావు తెలిపారు. ప్రతి ఉద్యోగి దాచుకున్న సొమ్మును రిటైర్‌మెంట్ తర్వాతే పింఛన్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. అనంతరం ఈపీఎఫ్ అధికారి పలు విద్యాసంస్థల అధికారులతో అవినీతి నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సరస్వతీ శిశు విద్యామందిర్, ఆర్.అండ్‌బీ, రూరల్ వర్క్స్ డివిజన్ ఉద్యోగుల పించను సమస్యలపై వినతులను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారికి అందజేశారు.



అవినీతి నిర్మూలన వారోత్సవాలు సందర్భంగా ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

అంధ అక్కాచెల్లెళ్ల వైద్యానికి చర్యలు

కొరాపుట్: పుట్టుకతోనే అంధత్వంతో బాధపడుతున్న ముగ్గురు అక్కాచెల్లెళ్లను ఆదుకోవడానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. వివరాల్లోకి వెళితే.. నవరంగ్‌పూర్ జిల్లా జొరిగాం సమితి పపుగాం గ్రామ పంచాయతీ బరిగుడ గ్రామానికి చెందిన అర్జున్ శాంతకు గెమునా శాంత, తిలోత్తమ శాంత, మమతా శాంత అనే ముగ్గురు కుమార్తెలు. వీరు ముగ్గురూ పుట్టుకతోనే కంటిచూపు లేక బాధపడుతున్నారు. వీరికి ఎటువంటి ప్రభుత్వ సహాయం, వైద్యం అందలేదు. ఈ నిరుపేద గిరిజన కుటుంబం పడుతున్న బాధలు ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. స్పందించిన అధికారులు వీరికి వైద్యం అందించేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగా జొరిగాం సమితి వైద్యాధికారులు అర్జున్ శాంత ఇంటిని సోమవారం సందర్శించారు. ముగ్గురు అక్కాచెల్లెళ్ల జొరిగాం ఆస్పత్రిలో పరీక్షలు చేసి నవరంగ్‌పూర్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ కంటి వైద్య నిపుణులు పరిశీలించి వీరిని ప్రభుత్వ ఖర్చులతో భువనేశ్వర్ తరలించి చికిత్స చేయిస్తామని ప్రకటించారు.



అంధ బాలికలతో అధికారులు

గుణుపూర్-తెరువలి రైల్వే ప్రాజెక్టు భూసేకరణ అధికారి నియామకం



భొలానాథ్ మాఝి (ఫైల్)

రాయగడ: జిల్లాలోని గుణుపూర్-తెరువలి రైల్వే ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా అందుకు అవసరమయ్యే భూసేకరణకు సంబంధించి కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ అధికారిని నియమించింది. రాయగడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తున్న భొలానాథ్ మాఝి నియమితులయ్యారు. ఈ మేరకు సంబంధిత శాఖ ద్వారా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

బాణసంచా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బాణసంచాతో నిందితుడు, పోలీసు సిబ్బంది

రాయగడ: అనుమతి లేకుండా విక్రయిస్తున్న బాణసంచాను స్వాధీనం చేసుకున్నామని చందిలి పోలీసులు సోమవారం తెలిపారు. తెరువలి డీపీ క్యాంప్ పరిసరాల్లో అనుమతులు లేకుండా మందుగుండు సామగ్రిని విక్రయిస్తుండగా సిబ్బంది వెళ్లి 1.50 లక్షల రూపాయల విలువైన సరుకును స్వాధీనం చేసుకున్నామన్నారు. సంబంధిత వ్యక్తిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు.

మరదలిపై లైంగిక దాడి.. బావ అరెస్టు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎంవీ 79 పోలీస్‌స్టేషన్ పరిధిలో గల ఎంవీ 82 గ్రామంలో అమిత్ జాని (28) అనే యువకుడు మరదలిపై లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆమె తల్లి ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. అమిత్ ఆంధ్రప్రదేశ్‌లో రోజు కూలీగా పనిచేస్తున్నాడు. గతంలో అమిత్ భార్య చెల్లి అక్కకు సాయంగా ఆమెతో పాటు ఉండేది. ఆ యువతి ఇటీవల ఇంటికి రాగా వాంతులు కావడాన్ని తల్లి గమనించింది. వైద్యులకు చూపిస్తే గర్భవతి అని చెప్పారు. దీంతో ఆమెను నిలదీయగా అమిత్ పేరు చెప్పింది. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు అమిత్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు.

దీపావళి మేళా-24 ప్రారంభం



మేళాను ప్రారంభిస్తున్న కుహోరొ, పక్కనే సబ్ కలెక్టర్ కల్యాణి, తదితరులు

స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో గల ఓర్మాస్ సంస్థ విక్రయ కార్యాలయం ప్రాంగణంలో దీపావళి మేళాను సోమవారం ప్రారంభించారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహోరొ ముఖ్యఅతిథిగా, సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రాదేవి గౌరవ అతిథిగా హాజరయ్యారు. 31 తేదీ వరకు మేళా కొనసాగనుంది. ఇక్కడ మట్టి దీపాలు ఆకట్టుకుంటున్నాయి. అలాగే లోహంతో తయారు చేసిన బొమ్మలు కూడా తక్కువ ధరకే దొరుకుతున్నాయి.

– రాయగడ



మట్టి ప్రమిదలు



లోహంతో రూపొందిన బొమ్మలు



మేళాలో వివిధ ఆకృతుల్లో ప్రమిదలు

క్లుప్తంగా

బీజేపీలోకి కాంగ్రెస్, బీజేడీ కార్యకర్తలు



కొరాపుట్ ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరిన కాంగ్రెస్, బీజేడీ కార్యకర్తలు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడలో పలువురు కాంగ్రెస్, బీజేడీ కార్యకర్తలు సోమవారం అధికార బీజేపీలో చేరారు. బొయిపరిగుడ సమితి దొబాపుట్‌లో బీజేపీ నిర్వహించన మిశ్రణ పర్వ్‌లో ఈ రెండు పార్టీలకు చెందిన 400 మంది కార్యకర్తలు కొరాపుట్ ఎమ్మెల్యే రఘునాథ్ మచ్చ సమక్షంలో చేరారు. బీజేపీలో చేరిన వారిలో పలువురు మాజీ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, సర్పంచ్‌లు, సమితి మెంబర్లు, వారి అనుచరులు ఉన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో మోహన్ ప్రభుత్వాల ప్రజాహిత కార్యక్రమాలకు ఆకర్షితులై బీజేపీలో చేరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ మిశ్రణ పర్వ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుమన్త ప్రధాన్, బీజేపీ ప్రభారి రాజేంద్ర సాహు, బొయిపరిగుడ బ్లాక్ బీజేడీ అధ్యక్షుడు ఉమేష్ పట్నాయిక్, జిల్లా ఆదివాసీ మోర్చ అధ్యక్షుడు నరేంద్ర కందులియ తదితరులు పాల్గొన్నారు.

ఘన స్వాగతం



కుంద్రాకు చేరిన మశాలను స్వాగతిస్తున్న ప్రజలు, ప్రజాప్రతినిధులు

జయపురం: కొరాపుట్ జిల్లాలో నవంబర్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి ఆదివాసీ మహోత్సవం కొరాపుట్ పర్వ్–2024 మశాల ఆదివారం రాత్రి కుంద్రాకు చేరింది. మశాలకు ప్రజలు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. మహోత్సవాన్ని సాయంత్రం సెమిలిగుడ సమితి దుదారిలో ప్రారంభించారు. 14 సమితులు, 4 పురపాలక పరిషత్‌లకు ఆయా ప్రాంతాల అధికారులు మశాలను వెలిగించి తీసుకువెళ్లారు. బుడి ఠకురాణి మందిరంలో మశాలను ఉంచారు. మందిరం నుంచి మశాలను తీసుకువచ్చి సమితి స్థాయి ఉత్సవాలు జరుపుతామని బీడీఓ కపిలేశ్వర తండి వెల్లడించారు. సమితి అధ్యక్షురాలు రాజేశ్వరి పొరజ, ఉపాధ్యక్షులు తరణిసేన్ బిశాయి, బీజేపీ అధ్యక్షుడు బద్రి నారాయణ ఆచార్య, అంబు పాత్ర, బీజేడీ అధ్యక్షుడు బృందావన మల్లిక్, జిల్లా పరిషత్ సభ్యురాలు కనకలత పెంటియ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపూర్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు అనుమతి



బొయిపరిగుడ బీడీఓకు కృతజ్ఞతలు తెలుపుతున్న గ్రామస్తులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి లక్ష్మీపూర్‌లో కొత్తగా పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు అనుమతి లభించింది. ఈ విషయం తెలిసిన లక్ష్మీపూర్ గ్రామ ప్రజలు సోమవారం బొయిపరిగుడ బీడీఓ భాస్కర చంద్ర సాహుని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. లక్ష్మీపూర్‌లో పోలింగ్ కేంద్రం లేకపోవటం వల్ల ఎన్నికల సమయంలో పలు ఇబ్బందులు పడేవారు. ఓటు వేసేందుకు గ్రామానికి 7 కిలోమీటర్ల దూరంలో గల బొయిపరిగుడ వెళ్లేవారు. గ్రామంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని బీడీఓను కలిసి డిమాండ్ చేస్తూ వచ్చారు. గ్రామంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయకపోతే ఎన్నికలు బహిష్కరిస్తామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు ఆయన రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదన చేశారు. ఎన్నికల కమిషన్ లక్ష్మీపూర్‌లో పోలింగ్ కేంద్రం మంజూరు చేస్తూ ప్రకటించింది. దీనిపై ఆ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

సిమిలిపాల్ అభయారణ్యంలో కొత్త పులి



సిమిలిపాల్ అభయారణ్యంలో పెద్ద పులి జమున

భువనేశ్వర్: వన్య ప్రాణుల స్థాన మార్పిడి ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ప్రముఖ సిమిలిపాల్ పులుల అభయారణ్యానికి కొత్త పెద్ద పులిని తరలించారు. దీన్ని మహా రాష్ట్ర తడోబా పులుల అభయారణ్యం నుంచి 900 కిలోమీటర్ల సుదీర్ఘ రహదారి మార్గంలో ఇక్కడకు సురక్షితంగా తీసుకుని వచ్చారు. ఆదివారం ఉదయం 9.25 గంటల ప్రాంతంలో సిమిలిపాల్ పులుల అభయారణ్యంకు చేరింది. ప్రాథమిక ఆరోగ్య స్థితిగతుల్ని పరిశీలించి సోమవారం ఉదయం అభయారణ్యంలోనికి విడుదల చేశారు. ఇది చురుకుగా తిరుగాడుతున్నట్లు అభయారణ్యం అధికార వర్గాలు తెలిపాయి. సిమిలిపాల్‌లో చేరిన కొత్త పులిని జమునగా పేర్కొన్నారు. జమున వయసు రెండున్నర ఏళ్లు.

సకాలంలో నష్ట నివేదిక

భువనేశ్వర్:

ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సోమవారం ఆకాశ మార్గంలో దానా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్ని సందర్శించారు. బాలాసోర్, మయూర్‌భంజ్ జిల్లాల్లో దానా తాకిడి ప్రభావాన్ని ముఖ్యమంత్రి సమీక్షించారు. ముఖ్యమంత్రితో రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి, ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్ వై. బి. ఖురానియా, ప్రత్యేక సహాయ కమిషనరు డీకే సింగ్ విహంగ వీక్షణ సర్వేలో పాల్గొన్నారు. వరుసగా రెండో రోజున విహంగ వీక్షణ సమీక్ష నిర్వహించడం విశేషం. ఆదివారం కేంద్రాపడా, భద్రక్ జిల్లాలు సందర్శించిన విషయం తెలిసిందే.

బాలాసోర్‌లో సమీక్ష సమావేశం

విహంగ వీక్షణం తర్వాత బాలాసోర్‌లో ముఖ్యమంత్రి దానా తుపాను సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పొంగిన నదులతో తలెత్తిన ఆకస్మిక వరదల ఉధృతిని ముఖ్యమంత్రి సమీక్షించారు. క్షేత్ర స్థాయిలో పంట నష్టం వంటి వైపరీత్య పరిస్థితుల్ని సమీక్షించి సర్వే ముగించి సమగ్ర నివేదిక దాఖలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశించారు. ఈ ప్రక్రియ నవంబరు నెల 2 నాటికి ముగించి సమగ్ర నివేదిక ప్రభుత్వానికి దాఖలు చేయాలని నిర్ధారించారు. తదనంతర చర్యల్లో భాగంగా తక్షణమే బాధిత వర్గాలకు ప్రభుత్వం సముచిత పరిహారం ప్రత్యక్ష లబ్ధి బదిలీ డీబీటీ ద్వారా చెల్లిస్తుందన్నారు.



హెలికాప్టర్‌లో దానా ప్రభావిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రితో రెవెన్యూ మంత్రి



విహంగ వీక్షణంలో జల దిగ్బంధ పంట పొలాలు తదితర ప్రాంతాలు



ముఖ్యమంత్రితో ఆకాశ మార్గంలో తుపాను పీడిత ప్రాంతాల్ని సందర్శించిన ప్రభుత్వ అధికారులు

నిన్న వలస కార్మికుడు.. నేడు ఓఏఎస్ అధికారి

భువనేశ్వర్: పట్టుదల, దృఢ సంకల్పంతో ప్రతిష్టాత్మక సివిల్స్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన నిన్నటి వలస కార్మికుడు ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఓఏఎస్) అధికారిగా బాధ్యతలు చేపట్టనున్నాడు. ఒడిశా పబ్లిక్ సర్వీసు కమిషను ఓపీఎస్‌సీ ఇటీవల విడుదల చేసిన సివిల్స్ తుది ఫలితాల్లో బిష్ణు చరణ్ నాయక్ ఉత్తీర్ణత సాధించాడు. గంజాం జిల్లా బెల్లొగుంతొ మండలం సిరికొయి గ్రామస్తుడు ఓఏఎస్ ఉత్తీర్ణుడు బిష్ణు చరణ్ నాయక్. ఒడిశా పబ్లిక్ సర్వీసు కమిషను ఓపీఎస్‌సీ ప్రకటించిన తుది ఫలితాల్లో 426 ర్యాంకు సాధించి ఉత్తీర్ణత సాధించాడు.

కష్టాలే ప్రేరణాత్మకం

12వ తరగతి పరీక్షల్లో విఫలం కావడంతో బీదరికం కోరల్లోంచి బయట పడేందుకు కూటి కోసం పొట్ట చేతబట్టుకుని సూరత్ వలస పోయాడు. అక్కడ నూలు మిల్లులో కార్మికుడిగా చేరాడు. నెలసరి అరకొరగా రూ.8,000 జీతంతో బిక్కు బిక్కుమంటూ జీవనం గడిపాడు. ఈ దయనీయ పరిస్థితుల్ని అధిగమించేందుకు చదవాలని నిర్ణయించుకున్నాడు. ఫెయిల్ కావడంతో అర్ధంతరంగా స్వస్తి పలికిన చదువును పునఃప్రారంభించాడు. అది మొదలు కొని వెనుదిరిగి చూసేది లేకుండా ఏటా ఉత్తీర్ణత సాధిస్తూ పోస్టు గ్రాడ్యుయేటు అభ్యర్థిగా అనుకున్న లక్ష్యం సాధించాడు. ఈ ప్రేరణతో ఎస్‌ఈటీ పోటీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి సహాయ అధ్యాపకుడుగా గౌరవపూర్వక ఉద్యోగిగా తొలి ఉన్నత విజయం సాధించాడు.



బిష్ణు చరణ్ నాయక్

క్రమంగా కుటుంబ పోషణ, ఆర్థిక స్థితిగతులు ఉనికిని బలపరచుకోవడంతో సివిల్స్ వైపు దృష్టి సారించాడు. పగలు అధ్యాపకునిగా బాధ్యతలు నిర్వహిస్తూ రాత్రి పూట సివిల్స్ పోటీ పరీక్షల కోసం సన్నాహాలు ఆరంభించాడు. నిర్విరామంగా శ్రమించి తొలి ప్రయత్నంలోనే ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ సరీ్వసు అధికారి (ఓఏఎస్) పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాడు.

వలస కార్మిక వ్యవస్థ నిర్మూలన

రాష్ట్రం నుంచి కార్మికులు వలస పోకుండా తన వంతు కృషి చేస్తానని బిష్ణు చరణ్ నాయక్ గట్టి నమ్మకం వ్యక్తం చేశాడు. ఈ వర్గం వెతలు తొలగించి సాధికారిత కోసం నడుం బిగించనున్నట్లు పేర్కొన్నాడు. రాష్ట్రంలో కార్మికులకు ఉపాధి అవకాశాలు, వనరుల్ని పెంపొందించడమే లక్ష్యంగా పేర్కొన్నాడు.

కారులో భారీగా గంజాయి పట్టివేత



గంజాయితో నిందితుడిని పట్టుకున్న పోలీసులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి బోడపోధర పంచాయతీ డైక్ 3 గ్రామం వద్ద సోమవారం మధ్యాహ్నం ఐఐసి ముకుందో మేల్కతన సిబ్బందితో కలిసి ఓ కారులో గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయిను బోడపోధర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నారు. ఈ గంజాయిని పోలీసులు చిత్రకొండ పోలీసుస్టేషన్‌లో తూకం వేయగా 270 కిలోలు ఉంది. వీటి విలువ రూ.35 లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు.

20 కిలోల గంజాయి స్వాధీనం

రాయగడ: మోటార్ బైకుపై గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను జిల్లాలోని గుడారి పోలీసులు సోమవారం సాయంత్రం పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 20.500 కిలోల గంజాయితో పాటు 600 రూపాయల నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

కార్మికుల వలస కట్టడికి సన్నాహాలు



ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్ అధ్యక్షతన కార్మిక వలస కట్టడి టాస్క్‌ఫోర్స్ సమావేశం

భువనేశ్వర్:

రాష్ట్రం నుంచి కార్మికుల వలస నివారణ ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేసింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్ అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్ పనిచేస్తుంది. ఈ వర్గం తొలి సారిగా సోమ వారం సమావేశమైంది. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులకు స్థానికంగా కార్మిక వనరులు కల్పించే దిశలో వ్యూహాత్మక కార్యాచరణ ప్రధాన శీర్షికగా ఈ సమావేశంలో చర్చించారు. సుస్థిరమైన జీవనోపాధితో కార్మికులకు ఉన్న చోటనే ఆర్జన అవకాశం ఆవిష్కరణ దిశలో టాస్క్‌ఫోర్స్ కృషి చేస్తుందని ఉప మ్యుమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్ తెలిపారు. కార్మికుల సాధికారితతో వలసకు కట్టడి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి మరో ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా, గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ రాజ్, తాగు నీటి శాఖ మంత్రి రొబి నాయక్, పరిశ్రమల శాఖ మంత్రి సంపద్ స్వంయి, కార్మిక–ఉపాధి, ఈఎస్‌ఐ శాఖ మంత్రి గణేష్ రామ్ సింగ్ ఖుంటియా, హోం శాఖ కార్యదర్శి సత్యవ్రత సాహు, అభివృద్ధి కమిషనరు అనూ గర్గ్ హాజరయ్యారు.

జగన్నాథ స్వామి మందిరానికి రూ.2.22 లక్షల విరాళం



జగన్నాథస్వామి మందిరానికి విరాళం అందజేస్తున్న టంకాల శ్రీనివాసరావు

పర్లాకిమిడి: జగన్నాథ స్వామి మందిర పునర్మిణానికి మటియా వీధికి చెందిన టంకాల శ్రీనివాసరావు విరాళమిచ్చారు. ఏకాదశి సోమవారం నాడు రూ.2,22,222 లు విరాళంను ట్రస్టీ సభ్యులు దుర్గాపాణిగ్రాహికి అందజేశారు.

నాటుసారా తరలిస్తున్న మహిళ అరెస్టు



పట్టుబడిన మహిళతో అబ్కారీ శాఖ సిబ్బంది

జయపురం: అనాధికారికంగా నాటుసారాను తరలిస్తున్న మహిళను అరెస్టు చేసినట్టు అబ్కారీ శాఖ అధికారులు తెలిపారు. పట్టుబడిన నిందితురాలిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచినట్లు జయపురంఅబ్కారీ శాఖ ఐఐసీ రాజుకుమార్ కిడి సోమవారం వెల్లడించారు. ఆమె నుంచి స్వాధీనం చేసుకున్న సారాను పారబోశామన్నారు.

మా పేపర్లు మళ్లీ దిద్దాలి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో ఉన్న మోడ్రన్ డిగ్రీ కళాశాలలో థర్డ్ ఇయర్ విద్యార్థులు సోమవారం ఆందోళన చేశారు. నెల రోజుల కిందట మూడో సెమిస్టర్ పరీక్షలు అయ్యాయని, 80 మార్కులకు పరీక్ష రాస్తే అందరికీ రెండు మూడు మార్కులు వేశారని అందరం బాగానే పరీక్ష రాశామని అన్నారు. బరంపురం యూనివర్సిటీ వారు మళ్లీ పేపర్లు దిద్దాలని డిమాండ్ చేశారు.

దోపిడీ కేసులో నలుగురి అరెస్టు

రాయగడ: రెండు దోపిడీ కేసుల్లో నలుగురు నిందితులను జిల్లాలోని టికిరి పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో బడభొక్క ప్రాంతానికి చెందిన ప్రఫుల్ల పాణి, టికిరి పంచాయతీలోని అమ్మాగుడ గ్రామానికి చెందిన లోకనాథ సాహు, మండలగుడ గ్రామానికి చెందిన రమేష్ హియాల్, కెస్కాపాడి గ్రామానికి చెందిన ప్రశాంత కులసికలు ఉన్నారు. నిందితుల నుంచి 7,500 రుపాయల నగదు, మూడు బంగారు మంగళసూత్రాలు, ఒక లాకెట్, విరిగిన బంగారు చెవి దిద్దులు, రెండు పదునైన కత్తులు, రెండు మొబైల్ ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించారు. ఈ కేసులకు సంబంధించి ఎస్‌డీపీవో రష్మీరంజన్ సేనాపతి, టికిరి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 21వ తేదీన టికిరి సమితి ఉపర్‌కొడింగ గ్రామంలో రామ సాహు అనే వ్యక్తి ఇంట్లో గుర్తు తెలియని దుండగులు ఇంటి పైకప్పును విరగ్గొట్టి లోపలకు చొరబడ్డారు. రూ. 20 వేల నగదు, కొన్ని బంగారు ఆభరణాలను దోచుకువెళ్లారు. చోరీపై బాధితుడు సెప్టెంబర్ 23వ తేదీన ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను పట్టుకున్నారు. అలాగే మరో కేసుకు సంబంధించి.. సెప్టెంబర్ 25వ తేదీన టికిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని జమ్ముగుడ గ్రామానికి చెందిన నిరుపమ చౌదరి ఇంట్లోకి దొంగలు చొరబడ్డారు. దంపతులను బంధించి రూ. 20 వేల నగదు, బంగారు ఆభరణాలు దోచుకువెళ్లారు. ఈ మేరకు బాధితురాలు టికిరి పోలీస్ స్టేషన్‌లో సెప్టెంబర్ 26వ తేదీన ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు రెండు కేసుల్లో నలుగురు దొంగలను అరెస్టు చేశారు.



నిందితులతో పోలీసులు

అవినీతి నిర్మూలనపై ప్రతిజ్ఞ



ప్రమాణం చేయిస్తున్న కలెక్టర్ బిజయకుమార్ దాస్



ర్యాలీలో మిషన్ శక్తి గ్రూపు మహిళలు



ర్యాలీని ప్రారంభిస్తున్న విజిలెన్స్ డీఎస్పీ, ఏడీఎం

పర్లాకిమిడి: అవినీతి నిర్మూలన వారోత్సవాలు సందర్భంగా స్థానిక టౌన్ హాల్ వద్ద చైతన్య ర్యాలీని అదనపు జిల్లా జడ్జి రాజేంద్ర మింజ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ ర్యాలీలో విజిలెన్స్ డీఎస్పీ వాసుదేవరావు, డీఆర్‌డీఏ ముఖ్యకార్య నిర్వహణ అధికారి గుణనిధినాయక్, మిషన్‌శక్తి డీపీఎం టిమోన్ బోరా, స్వయం సహాయక గ్రూపుల మహిళలు పాల్గొన్నారు. ర్యాలీలో మహిళలు అవినీతి నిర్మూలనపై ప్లాకార్డులు పట్టుకుని కలెక్టరేట్ వరకు నినాదాలు చేస్తూ వెళ్లారు. అనంతరం కలెక్టరేట్‌లో ఓశ్వాన్ భవన్‌లో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ పాల్గొన్నారు. జిల్లాలో అవినీతి నిర్మూలనపై ప్రభుత్వ అధికారులు, మిషన్ శక్తి మహిళలతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ స్థాయి అధికారులు, ఎస్పీ జితేంద్రనాథ్ పండా, సబ్ కలెక్టర్ అనూప్ పండా, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మెరుగైన ఆరోగ్యం



వర్క్‌షాప్‌లో పాల్గొన్న మహిళలు, పిల్లలు

జయపురం: క్రీడలతో మెరుగైన ఆరోగ్యం సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. పిల్లలు ఆటల్లో పాల్గొనడం ద్వా శారీరక, మానసిక వికాసం కలుగుతోందన్నారు. స్థానిక సరస్వతీ శిశుమందిరంలో సోమవారం మాతృ వర్క్‌షాపును నిర్వహించారు. జయపురం సరస్వతీ శిశు విద్యాలయ ప్రధాన ఆచార్యులు సత్యనారాయణశెట్టి అధ్యక్షతన వర్క్‌షాప్ జరిగింది. చదువుతో ఆటోల్లో కూడా పిల్లలను ప్రోత్సహించాలని అన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కవితా సాహు, శిశజర చంద్రదాస్, శశ్మిత దాస్ పాల్గొన్నారు.

అడవిలో దాచిన గంజాయి పట్టివేత

జయపురం: బొయిపరిగుడ సమితి కొటపడ పంచాయతీ బొడొఅటల్ గ్రామ సమీపంలో గల అడవిలో 4 క్వింటాళ్ల 14 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాంజళి ప్రధాన్ సోమవారం వెల్లడించారు. ఆదివారం కొందరు ప్రజలు అటుగా వెళ్తూ ఈ గంజాయి బస్తాలను చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసు అధికారి గీతాంజలి ప్రధాన్ నేతృత్వంలో ఒక టీమ్ అటవీ ప్రాంతానికి చేరుకుని ఆ బస్తాలను పరిశీలించి చూస్తే గంజాయి దొరికింది. వెంటనే బస్తాలు సీజ్ చేసి మెజిస్ట్రేట్ సమక్షంలో తూకం వేయగా 4 క్వింటాళ్ల 14 కిలోలు ఉన్నట్లు పోలీసు అధికారి వెల్లడించారు. దీని విలువ రూ.50 లక్షలు ఉంటుందని తెలిపారు.



బొయిపరిగుడ సమితి అడవిలో పట్టుబడిన గంజాయి

రైల్వే స్థలాల్లో ఆక్రమణల తొలగింపు

- నోటీసుల ప్రాప్తికి అధికారుల చర్యలు

రాయగడ: రైల్వే స్థలాల్లో ఆక్రమణల తొలగింపునకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా విజయనగరం నుంచి టిట్లాఘడ్ వరకు నిర్మాణం కొనసాగుతున్న మూడో లైన్ పనుల్లో భాగంగా స్థానిక అండర్‌గ్రౌండ్ నుంచి రాణిగుడ కోళ్ల ఫారం వరకు గల రైల్వే స్థలాల్లోని ఆక్రమణల తొలగింపునకు సోమవారం చర్యలు ప్రారంభించారు. ముందుగా నోటీసులు జారీ చేసిన రైల్వే శాఖ దానికి అనుగుణంగా తొలగింపు చేస్తున్నారు. కొన్నేళ్లుగా రైల్వే స్థలంల్లో ఇళ్లను నిర్మించుకుని ఉన్న వందకు పైబడిన కుటుంబాలు తొలగింపు కారణంగా నిర్వాసితులయ్యారు. ముందుగా అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేసి అనంతరం జేసీబీల సహాయంతో ఇళ్లను తొలగించారు. కొందరు స్వచ్ఛందంగా ఇళ్లను ఖాళీ చేయడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే మరి కొన్ని ఇళ్లను తొలగించాల్సి ఉండటంతో రైల్వే శాఖ అధికారులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుజాగ్రత్త చర్యలను చేపట్టనున్నట్లు సమాచారం . ఈ తొలగింపులు చేపట్టే సమయంలో పోలీసుల బలగాలను మోహరించిన అనంతరం వారి సమక్షంలో తొలగింపు పనులు చేపట్టనున్నారు. స్థానిక సంతోషిమాత కోవెల వెనుకగల కాలనీ, భీమో వీధి, కంద్రవీధి, కేఎన్‌కే ఎదురుగా గల ప్రాంతాల్లోని రైల్వే స్థలాల్లో ఉన్న ఇళ్లను, కాలనీలను పూర్తిగా తొలగించనున్నారు.



అండర్‌గ్రౌండ్ నుంచి రాణిగుడ కోళ్లఫారం ప్రాంతంలో ఇళ్లను తొలగిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

అత్యాచార నిందితుడి అరెస్ట్

విజయనగరం క్రైమ్: గంట్యాడ మండలం కొటారుబిల్లి జంక్షన్ వద్ద మూడున్నరేళ్ల బాలికపై ఆదివారం జరిగిన లైంగిక దాడికి సంబంధించి నిందితుడి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికపై లైంగిక దాడి జరిగినట్లుగా సమాచారమందిన వెంటనే మహిళా పీఎస్‌లో నిందితుడు విజినిగిరి రవిపై పోక్సో కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. విజయనగరం డీఎస్పీ ఎం. శ్రీనివాసరావును దర్యాప్తు అధికారిగా నియమించినట్లు తెలిపారు. బాలికకు అన్ని వైద్య పరీక్షలు నిర్వహించామని, ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ త్వరగా పూర్తి చేసి నిందితుడికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అత్యాచార సంఘటన అమానుషం

విజయనగరం అర్బన్: గంట్యాడ మండలంలో జరిగిన చిన్నారి అత్యాచార సంఘటన అమానుషమని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నిబంధనలు పాటించే వారికే అనుమతులు



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయాల కోసం నిబంధనలు పాటించిన వారికే అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన అధికారులతో నేరుగాను.. ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం మాట్లాడారు. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేసి, అన్ని నిబంధనలు పాటించినట్లు ధ్రువీకరించిన తర్వాతే లైసెన్స్‌లు మంజూరు చేయాలని సూచించారు. జిల్లాలో ఈ నెలాఖరు వరకు గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్‌ను కొనసాగించాలన్నారు. మండల బృందాలతో మాట్లాడి నిరంతరం పారిశుధ్య పనులు కొనసాగేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

పార్వతీపురం టౌన్: బాల సంరక్షణ కేంద్రాలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయాలని అదనపు జిల్లా పర్యవేక్షణాధికారి బి.రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు పొందుతున్న బాల సంరక్షణ కేంద్రాలను జువైనల్ జస్టిస్ చట్టం 2015 ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయాలని పేర్కొన్నారు. నవంబర్ 11లోగా బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమశాఖ సంచాలకులకు నిర్దేశించిన ఫార్మెట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా పర్యవేక్షణ అధికారి వీవీ రవికుమార్ (91000 45398), జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ (9440332581)లను సంప్రదించాలన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదాతలను అభినందిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పార్వతీపురం టౌన్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక పోలీస్ వెల్ఫేర్ ఫంక్షన్ హాల్‌లో ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి ఆధ్వర్యతన ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం, హెల్త్‌క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అమరులైన పోలీసులను స్మరించుకోవడం మనందరి బాధ్యతన్నారు. పోలీసులు చూపించిన ధైర్య సాహసాలు, నిబద్ధత ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఒ. దిలీప్‌కిరణ్, ఏఎస్పీ అంకిత సురానా, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైలు ఢీ కొని వ్యక్తి మృతి

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం రైల్వేగేట్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీ కొనడంతో వ్యక్తి మృతి చెందినట్లు విజయనగరం రైల్వే ఎస్సై బాలాజీ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం మండలం గుంకలాం గ్రామానికి చెందిన నేమాని సత్యనారాయణ (37) రైలు పట్టాలు దాటుతుండా రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని సర్వసజన ఆస్పత్రికి తరలించారు.



కొండ సమీపంలో సాగుచేసిన మొక్కజొన్నపంట

- ఇష్టానుసారంగా చెట్లను నరికేస్తున్నారు
- వందల ఎకరాల్లో ఆక్రమణలు
- వలసదారుల చెరలో అటవీ సంపద
- చోద్యం చూస్తున్న అధికారులు



ఆక్రమిత అడవిలోని సియోనువలస గ్రామంలో ఆరబెట్టిన మొక్కజొన్న

అడవికి పోడు దెబ్బ

బొబ్బిలి రూరల్: ఎక్కడ నుంచో వచ్చి వందల ఎకరాల్లోని విలువైన అటవీ సంపదను దోచుకున్నారు. వలస వచ్చి పచ్చని అడవితల్లికి గర్భశోకం మిగిల్చారు. అనాథలమన్న నెపంతో అడవితల్లిని అడ్డంగా నరికి ఆక్రమించారు. ఫలితంగా పర్యావరణంతో పాటు పచ్చదనం కానరావడం లేదు. అడవిని ఆక్రమించి పంటలు పండిస్తున్న వారిపై ప్రభుత్వం, అధికారులు ఉదాసీనంగా వ్యవరించడంతో వందలాది రకాల జంతువులు, పక్షి జాతులు కనుమరుగయ్యాయి. వలస వచ్చి అడవిని ఆక్రమించినవారి నుంచి పర్యావరణాన్ని కాపాడాలని సమీప గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గోపాలరాయుడిపేట, సీహెచ్ బొడ్డవలస, మల్లంపేట గ్రామాల మధ్యన చింపుకొండ, సూదికొండ, అడ్డుకొండల మధ్యలో సుమారు 450 హెక్టార్ల అటవీ భూములుండేవి. రిజర్వ్ ఫారెస్టుగా అటవీ శాఖాధికారులు గుర్తించి వీఎస్ఎస్‌లతో నిత్యం నిఘాలో ఉంచేవారు. దశాబ్దాలుగా స్థానిక గిరిజనులు అటవీ భూముల్లో పోడు వ్యవసాయం చేస్తున్నా, వీరి వల్ల అడవికి ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. కానీ ఇటీవల సుమారు ఏడేళ్ల నుంచి వేరే ప్రాంతాల్లో ఉన్న వారు వలసలుగా వచ్చి ఐదు కుటుంబాలుగా ఓ గ్రామాన్ని ఏర్పాటు చేసుకుంటూ ఇక్కడి అడవిని నరికేయడం మెదలు పెట్టారు. అత్యంత సారవంతమైన ఎర్రమట్టి నేల కావడంతో ఇక్కడ వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. ఇప్పుడు ఆ అటవీ ప్రాంతంలో ఐదు కొత్త గిరిజన గ్రామాలు ఏర్పడగా సుమారు 200 ఎకరాల అటవీ భూముల్లో వ్యవసాయం చేస్తున్నారు. ముందు పాకలు వేసుకున్న వలస గిరిజనులు తర్వాత పక్కా ఇళ్లు నిర్మించుకోగా.. ఆ గ్రామాలు సియోనువలస, చిన అక్కేనవలస, రామన్నవలస, కృపావలసలుగా రూపాంతరం చెందాయి. పైగా తమ గ్రామాలను చుట్టుపక్కల ఉన్న పంచాయతీల్లో విలీనం చేయాలని, ఓటుహక్కు, రేషన్‌కార్డు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక్కడ నివాసముంటూ వారి సొంత గ్రామాల్లో రేషన్ తీసుకునేందుకు నెలనెలా వెళ్లి వస్తున్నారు.



రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గోపాలరాయుడుపేట గ్రామస్తులు

చిక్కాల అడవినే మర్చిపోయారు..

చిక్కాల అడవి అనే పేరుతో ఈ అడవిని పిలుచుకునే ఆ ప్రాంత వాసులు చివరకు ఆ పేరునే మరిచిపోయారు. ఒకప్పుడు ఈ అడవిలోకి వెళితే ప్రాణాలతో బయటపడడం సాధ్యం కాదని, అంత చిక్కగా ఏపుగా ఉండే ఈ అడవి ఇప్పుడు అంతరించిపోయింది. పోడు వ్యవసాయం పేరుతో వాణిజ్య పంటలను సాగుచేస్తూ లక్షలాది రూపాయలను సంపాదిస్తున్నారు. గతంలో ఈ ప్రాంతంలో విలువైన అటవీ సంపదతో పాటు దుప్పులు, లేళ్ళు, అడవి నక్కలు, బౌరు పిల్లులు, చిరుతలు ఇలా అనేక రకాలైన అటవీ జంతువులు తిరుగుతుండేవి. ప్రస్తుతం ఆ జీవజాతులేవీ కానరావడం లేదు. ఎక్కడ నుంచో వచ్చి ఇక్కడ అడవులను నాశనం చేసి ఎంచక్కా బసను ఏర్పాటుచేసుకున్నారు. సౌర విద్యుత్‌ను ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు.

మేమేం పాపం చేశాం..

ఇదిలా ఉంటే తాము తరతరాలుగా ఇక్కడే ఉంటూ మొక్కలు పెంచి అడవిని సంరక్షిస్తున్నామని గోపాలరాయుడుపేట వాసులు చెబుతున్నారు. మామిడి, జామ వంటి మొక్కలు నాటి అడవిని కాపాడుతుంటే.. మాపై అటవీశాఖాధికారులు కేసులు పెడుతున్నారని వాపోయారు. వందలాది ఎకరాల్లో విలువైన చెట్లను అక్రమంగా నరికి వాణిజ్య పంటలను సాగుచేస్తున్నా వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గ్రామానికి చెందిన వి. సింహాచలం, వి. శంకరరావు, అప్పలనాయుడు, తదితరులు ప్రశ్నిస్తున్నారు. ఈ మేరకు అధికారుల తీరును నిరసిస్తూ సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

నోటీసులిచ్చాం..

అటవీ భూములను ఆక్రమించే వారికి ఇప్పటికే నోటీసులిచ్చాం. వారిపై చర్యలు తీసుకునేందుకు ఆర్డీఓకు సిఫార్సు చేశాం. మరోసారి నోటీసులిస్తాం. అడవులను నరికివేస్తున్న వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– ప్రసూన, ఇన్‌చార్జ్ జిల్లా అటవీశాఖ అధికారి, విజయనగరం

సమాచారం లేదు..



అటవీ శాఖ నుంచి మాకెంటువంటి సమాచారం లేదు. ఆక్రమణల గురించి మాకు తెలియదు. అటవీశాఖ వారు మాకు సమాచారం ఇస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– మోహనరావు, ఆర్డీఓ, బొబ్బిలి

పొగిరిలో చారిత్రక ఆనవాళ్లు..



కాకతీయుల నాటి నందిని చూపుతున్న రంగనాథం

- రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు రంగనాథం

రాజాం సిటీ: మండల పరిధి పొగిరి గ్రామంలో చారిత్ర ఆనవాళ్లు ఉన్నాయని రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథం తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, రాజాం చరిత్ర రచనలో భాగంగా ఇటీవల గ్రామాన్ని సందర్శించానన్నారు. ఆ సమయంలో గ్రామం ముందర రోడ్డు పక్కన పురాతన నాగదేవత శిల్పాన్ని గుర్తించామని చెప్పారు. అలాగే గ్రామంలో వెయ్యేళ్ల నాటి అగస్త్యేశ్వర ఆలయం ఉందని తెలిపారు. అందులో ఉండే శివలింగం పురాతనమైన్నారు. అలాగే కోనేరు నుంచి ఉన్నత పాఠశాల వెళ్లే దారిలో ఒక దిబ్బపై వెయ్యేళ్ల నాటి కోవెల శిథిలాలు ఉన్నాయని, అక్కడే ఉన్న చాముండి విగ్రహం కాకతీయుల దేవత కాకతికి చెందిన సప్తమాతృకలలో ఒకటని తెలిపారు. ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ ముఖ్యకార్య నిర్వహణ అధికారి ఈమని శివనాగిరెడ్డి, తెలంగాణ చరిత్ర పరిశోధకుడు రామోజ్ హరగోపాల్‌కు విగ్రహాల వివరాలు తెలియజేయగా.. అవన్నీ 10,12 శతాబ్దాలకు చెందినవిగా నిర్ధారించారని చెప్పారు. పొగిరిని ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని కోరారు.

ఆలోచన.. ఆవిష్కరణ



నమూనాలు చూసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

- సృజనకు పదునుపెట్టిన విద్యార్థులు
- గురుకుల సీవోఈలో సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం
- 33 గురుకులాల నుంచి 88 నమూనాల ప్రదర్శన
- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి విద్యార్థుల హాజరు

మధురవాడ (విశాఖ జిల్లా): గురుకుల విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వీరి నమూనాలు చక్కటి సృజనాత్మకతకు అద్దం పట్టాయి. ఆధునిక సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను విద్యార్థులు చక్కటి పరిష్కారాన్ని చూపించే వర్కింగ్ నమూనాలు తయారు చేశారు. ఇవి సందర్శకులతో పాటు కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను సైతం ఔరా అనిపించాయి. అద్భుతమైన నమూనాలకు మధురవాడ సమీపంలోని కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ వేదిక అయింది. ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 'ఫ్యూచర్ ఆన్' పేరుతో జోనల్ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర పరిధిలో ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు పరిధిలో లెక్కలు, సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హ్యూమానిటీస్‌తో పాటు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో సీనియర్, జూనియర్ విభాగాల్లో 33 గురుకులాలు నుంచి వచ్చిన 150 మంది విద్యార్థులు 88 వర్కింగ్ నమూనాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రారంభించారు. నమూనాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. అనంతరం నిర్వహించిన సభలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, అంతర్గత శక్తులను వెలికి తియ్యడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగప డతాయన్నారు. విద్యార్థులకు ప్రశ్నించే స్వేచ్ఛను ఉపాధ్యాయులు ఇవ్వాలన్నారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ ఉపాధికి ఉపయోగపడే విద్య అవసరమన్నారు. విశాఖ జిల్లా గురుకుల డీసీవో రూపావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాంతికుమారి, డీసీవోలు పాల్గొన్నారు.

చిన్నారిపై లైంగిక దాడి అమానుషం

- మంత్రి సంధ్యారాణి

విజయనగరం ఫోర్ట్: అభం, శుభం తెలియని చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన సంఘటన అత్యంత అమానుషమని, దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్య రాణి అన్నారు. గంట్యాడ మండలం కొటారుబిల్లి కూడలిలో లైంగిక దాడికి గురై ఘోష ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను సోమవారం సాయంత్రం ఆమె పరామర్శించారు. బాలిక ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో చర్చించారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. బాలికకు అన్ని విధలా అండగా ఉంటామన్నారు. మానవత్వాన్ని మంట గలిపిన ఇటువంటి మానవ మృగాలకు కఠినంగా శిక్ష పడాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి దారుణానికి పాల్పడిన నిందితుడికి న్యాయవాదులు బెయిల్ ఇప్పించవద్దన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలతో పాటు మగ పిల్లలకు మంచి చెడులు బోధించాలన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ నిందితుడిని వెంటనే అదుపులోకి తీసుకున్నామని, శాస్త్రీయంగా అన్ని ఆధారాలు సేకరిస్తున్నట్టు చెప్పారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి విచారణ జరిపేందుకు కృషి చేస్తామన్నారు. బాలికను పరామర్శించిన వారిలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

లైంగిక దాడిపై విచారణ

గంట్యాడ: మండలంలోని కొటారుబిల్లి కూడలిలో మూడున్నరేళ్ల బాలికపై జరిగిన లైంగిక దాడిపై విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు సోమవారం విచారణ జరిపారు. ఘటనా స్థలానికి నిందితుడిని తీసుకెళ్లి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో దిశ సీఐ నరసింహమూర్తి, గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ పాల్గొన్నారు.

అటవీ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

విజయనగరం ఫూల్‌బాగ్: ఉమ్మడి విజయనగరం జిల్లా జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక సోమవారం ఏక గ్రీవంగా జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం.మనోజ్‌కుమార్ (ఎస్ఎస్ఓ-పార్వతీపురం), కార్యదర్శిగా కేవీఎస్ రాజు (ఎఫ్ఎస్ఓ-ఆంధ్ర), ఉపాధ్యక్షురాలిగా ఎం.భారతి (ఎఫ్‌బీఓ-కుమిలి), ట్రెజరర్‌గా మహంతి రమేష్ (ఎఫ్‌బీఓ-కురుపాం), ఆర్గనైజర్‌గా బి.అవతారం (స్పెషల్‌డ్యూటీ-ఎఫ్ఎస్ఓ), కె.వి.జగదీష్(ఎఫ్‌బీఓ-పాడేరు)ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఎన్నికైన సభ్యులను డీఎఫ్ఓ ప్రసూన, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అప్పలరాజు అభినందించారు.

జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

- వచ్చే నెల 6 నుంచి 12 వరకు శ్రీనగర్‌లో జరగనున్న జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

తెర్లాం: జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన తొమ్మిది మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరంతా ఇటీవల అనంతపురం ఎస్కేడీ యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలో పాల్గొని అత్యుత్తమ ఆటతీరు కనబరిచడంతో, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. నవంబర్ 6 నుంచి 12వ తేదీ వరకు శ్రీనగర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో భాగంగా.. ఈ నెల 29 నుంచి అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్న కోచింగ్ క్యాంపునకు క్రీడాకారులంతా సోమవారం బయలుదేరారు. ఈ సందర్భంగా క్రీడాకారులను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన, కార్యదర్శి విజయకుమార్, ఉపాధ్యక్షుడు సాయి రమేష్, తదితరులు అభినందించారు.

ఫీ'జులుం'పై ఆందోళన

విజయనగరం ఫూల్‌బాగ్ : మహారాజా కళాశాలలో ఫీజుల దోపిడీకి అడ్డుకట్టవేయాలని కోరుతూ విద్యార్థిలోకం రోడ్డెక్కింది. కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించింది. కలెక్టరేట్ వద్ద బైఠాయించి ఆందోళన చేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ సేవాభావంతో పీవీజీ రాజు స్థాపించిన మహారాజా కళాశాలలో నేటి యాజమాన్యం విద్యార్థుల నుంచి జలగల్లా వేలాది రూపాయల ఫీజుల వసూలు చేస్తున్నారని తక్షణమే విద్యాదీవెన, వసతి దీవెన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వంతెనలు, తాగునీటి పథకాల వద్ద ఇసుక తవ్వొద్దు

సీతంపేట: నదుల్లోని తాగునీటి పథకాలు, వంతెనల సమీపంలో ఇసుక తవ్వకాలు చేపట్టరాదని, కనీసం ఐదు వందల మీటర్ల పరిధి నిబంధన పాటించాలని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఆదేశించారు. ఐటీడీఏలో వివిధ శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వితే చర్యలు తీసుకోవాలని, వాహనాలు సీజ్ చేయాలని తహసీల్దార్లకు సూచించారు. నిధులు మంజూరయ్యాక రోడ్లు, ఇతర మౌలిక వసతుల పనులు మూడు నెలల్లో ప్రారంభించకపోతే సంబంధిత ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనులు నాణ్యత చూసిన తరువాతనే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలన్నారు. పీఆర్, ఆర్అండ్‌బీ, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. నిర్దేశిత లక్ష్యాల ప్రకారం సంక్రాంతి నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ భవనాల్లో తాగునీరు, మరుగుదొడ్లు సౌకర్యంపై ఇచ్చిన డిజైన్ ప్రకారం పనులు పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. మంచినీటి సమస్యను ప్రతీ ఆవాసంలో గుర్తించాలన్నారు. జల్ జీవన్ మిషన్ పనుల ప్రగతి వివరాలు అందించాలన్నారు. రానున్న వేసవి నీటిఎద్దడి నివారణకు ఇప్పటి నుంచే సర్వే చేయాలన్నారు. దోనుబాయి పీహెచ్‌సీలో రెండో వైద్యాధికారిని నియమించేందుకు అవుట్ సోర్సింగ్ నోటిఫికేషన్ ఇవ్వాలని డీఎంహెచ్‌ఓకు ఆదేశించారు. ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి, ఏపీఓ చిన్నబాబు, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

- గోతులమయమైన అంతర్‌రాష్ట్ర రహదారి
- గుమడ వద్ద గోతిలో కూరుకుపోయిన లారీ
- సుమారు 24 గంటల పాటు నిలిచిపోయిన రాకపోకలు
- 15 కిలోమీటర్ల మేర బారులు తీరిన వాహనాలు
- తిండి లేక విలపిస్తున్న లారీ డ్రైవర్లు
- రోడ్డు బాగుచేయాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన



చెరువును తలపిస్తున్న పార్వతీపురం-కూనేరు అంతర్‌రాష్ట్ర రహదారి

ఇదెక్కడి దారిద్ర్యం

కొమరాడ:

పార్వతీపురం నుంచి కూనేరు వరకు అంతర్ రాష్ట్ర రహదారి అధ్వానంగా మారింది. పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీనిపై ప్రయాణించాలంటేనే వాహనచోదకులు హడలిపోతున్నారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోని భారీ పరిశ్రమలకు ముడిసరుకు, ఉత్పత్తుల తరలింపునకు ఈ మార్గమే ఆధారం. ప్రతిరోజూ వందలాది లారీలు ప్రయాణం చేస్తాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న రోడ్డు పూర్తిగా పాడవ్వడంతో వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డుపై గోతులు చెరువులా మారాయి. దానిలో ప్రయాణించే వాహనాలు మొరాయించాయి. రోడ్డు మధ్యలో ఒడిశా నుంచి పార్వతీపురం వస్తున్న లారీ, అంబులెన్స్ కూరుకుపోవడంతో సుమారు 24 గంటలపాటు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ఇటు పార్వతీపురం, అటు ఒడిశావైపు 15 కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. ఈ రోడ్డుపై ప్రయాణించే వారు నరకయాతన పడ్డారు. కనీసం ద్విచక్ర వాహనం వెళ్లేందుకు కూడా అవకాశం లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం రూ.11.75 కోట్లు నిధులు విడదల చేసినట్టు అధికారులు చెబుతున్నారే తప్ప పనులు చేయడం లేదంటూ సీపీఎం, రాయిగడ లారీల యూనియన్ నాయకులు మండిపడ్డారు. గుమడ వద్ద రోడ్డుపై సోమవారం కాసేపు ఆందోళన చేశారు. తక్షణమే రోడ్డును బాగుచేయాలంటూ సీపీఎం నాయకుడు కొల్లు సాంబమూర్తి డిమాండ్ చేశారు.



రోడ్డు బాగుచేయాలంటూ గుమడ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం, రాయగడ లారీ యూనియన్ నాయకులు



రోడ్డుపైనే తింటున్న లారీ డ్రైవర్లు

తిండిలేక విలపిస్తున్న డ్రైవర్లు

వందల సంఖ్యలో లారీలు రోడ్డుపై నిలచిపోవడంతో డ్రైవర్లు తిండీతిప్పలులేక ఇబ్బందులు పడ్డారు. కొందరు రోడ్డుపైనే వంటావార్పు చేసుకున్నారు. కరోనా పరిస్థితుల్లోకూడా ఇలాంటి ఇబ్బందులు చూడలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై ప్రయాణించాలంటే ఏ గోతిలో వాహనం ఇరుక్కుంటుందోనన్న బెంగ వెంటాడుతోందన్నారు.

మా ఇబ్బందులు ఆ దేవుడికే ఎరుక..



ఈ రహదారి పరిస్థితి దారుణం. మూడు నాలుగు రాష్ట్రాలకు ఈ రహదారే ప్రధానం. గుమడ వద్ద భారీ గోతులు కావడంతో ప్రత్యక్షనరకం చూస్తున్నాం. కనీసం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. గత రాత్రి నుంచి రోడ్డుపై దిక్కులేని స్థితిలో పడి ఉన్నాం. మంచినీరు కూడా దొరకని పరిస్థితి. మా బాధలు ఆ దేవుడికే ఎరుక.

– ఎం.వెంకటిరావు, సాలూరు, లారీ డ్రైవర్

గోతులైనా పూడ్చాలి



విశాఖపట్నం నుంచి ఛత్తీస్‌గఢ్‌కు మాంగనీస్ పౌడర్ తీసుకుని వెళ్తున్నా. రోడ్డుపై 12 గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. ఇంతటి దారుణం ఎక్కడా చూడలేదు. రోడ్డుపై లారీ నడపాలంటే భయం వేస్తోంది. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి కనీసం గోతులైనా పూడ్చాలి.

– రాజు, ఆకివీడు, లారీ డ్రైవర్